# పామాయిల్ తోటలతో సిరుల పంట

- వరిని వీడి పామాయిల్ వైపు మళ్లాలి.
- రైతులకు కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపు.



**దశ, సూర్యాపేట ప్రతినిధి:** రైతులు వరి సాగుకు స్వస్తి పలికి, రాబోయే రోజుల్లో లాభసాటిగా ఉండే పామాయిల్ తోటల వైపు మొగ్గు చూపాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. సూర్యాపేట మండలంలో కాసరాబాద్ లోని ఆయిల్ పామ్ పంటలను కలెక్టర్ పరిశీలించి పామాయిల్ సాగు చేస్తున్న మల్లేష్ అనే రైతుతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పామాయిల్ తోటలు రైతులకు సిరుల పంటగా మారనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

రైతులకు మేలు చేసే పంటల్లో పామాయిల్ అత్యుత్తమమైనదని కలెక్టర్ పేర్కొన్నారు. వరి సాగుతో పోలిస్తే ఇందులో పెట్టుబడి భారం చాలా తక్కువని తెలిపారు. ఒక్కసారి ఈ తోటను నాటితే నాలుగు సంవత్సరాల నుంచి మొదలై ఏకంగా 30 సంవత్సరాల వరకు రైతులకు స్థిరమైన, అధిక ఆదాయం లభిస్తుందని ఆయన వివరించారు. పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రైతులకు 70 శాతం నుండి 90 శాతం వరకు భారీ సబ్సిడీని అందిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న ఈ అద్భుతమైన సదుపాయాలను, రాయితీలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తోట నాటిన మొదటి నాలుగు సంవత్సరాల వరకు పెట్టుబడి సహాయం కింద ఎకరానికి రూ.4,200 చొప్పున ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. పామాయిల్ తోటల్లో మొదటి మూడు సంవత్సరాల వరకు మొక్కలు పెరిగే లోపు రైతులు వివిధ అంతర పంటలను సాగు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఇందులో కోకో, వక్క మిరియాలు,తమలపాకు వంటి వివిధ రకాల అంతర పంటలను బహుళ పంటలను సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని వివరించారు. మూడున్నర ఏళ్ల తర్వాత పామాయిల్ ద్వారా ప్రధాన ఆదాయం రావడం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య ,జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి తీగల నాగయ్య, వ్యవసాయ అధికారి కృష్ణ సందీప్ , వ్యవసాయ విస్తరణ అధికారి ముత్తయ్య,సూర్యాపేట డివిజన్ ఉద్యాన అధికారి కట్ట స్వాతి, ఉద్యాన విస్తరణ అధికారులు యారాల సుధాకర్ రెడ్డి, రంగు ముత్యం రాజు, వంగూరి అనిల్,ఆయిల్ ఫెడ్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ నిమ్మ గోపికృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ భవిష్య, రైతులు వెదిరే లక్ష్మీ నరసింహారెడ్డి, కిషన్ రెడ్డి, ఆశబోయిన మల్లేష్, బొమ్మగాని సైదులు, రామకృష్ణ, తన్నీరు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## నాచారంలోని వెస్లీ కోఎడ్యుకేషన్ హైస్కూల్ లో ఘనంగా స్వర్ణోత్సవ వేడుకలు




**దశ, ఓయూ:** నాచారంలోని వెస్లీ కోఎడ్యుకేషన్ హైస్కూల్ స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కనుల పండువగా సాగింది. 1965 సంవత్సరం నుంచి ఇటీవలి వరకు ఈ పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. దాదాపు 1,200 మంది పూర్వ విద్యార్థులు హాజరై తమ విద్యార్థి దశ అనుభవాలను పంచుకుంటూ ఆనందంగా గడిపారు.పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్రను కొనియాడిన పూర్వ విద్యార్థులు, తమ జీవితాలకు బాటలు వేసిన గురువులను ఘనంగా సన్మానించారు. దశాబ్దాల తర్వాత స్నేహితులు ఒకే చోట కలుసుకోవడంతో ప్రాంగణం ఆప్యాయ పలకరింపులు, ఆనందోత్సాహాలతో కళకళలాడింది.ఈ సందర్భంగా నిర్వాహకులు పాఠశాల చరిత్రను గుర్తు చేస్తూ, భవిష్యత్ తరాలకు విద్యా సేవలను మరింత విస్తరించేందుకు పూర్వ విద్యార్థుల సహకారం అందించాలని పిలుపునిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సన్మానాలు, జ్ఞాపికల ప్రదానంతో స్వర్ణోత్సవ వేడుకలు వైభవంగా ముగిశాయి.



## తార్నాకలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో మురారి స్మిత్ కోటేష్ గౌడ్



**దశ ఓయూ:** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా తార్నాక డివిజన్లో గురువారం ఇంటింటి ఓటరు ధ్రువీకరణ, ఫారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి. పద్మారావు గౌడ్ మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మురారి స్మిత్ కోటేష్ గౌడ్ చురుకుగా పాల్గొన్నారు. బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) అఖిలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించిన ఫారాలను పంపిణీ చేశారు.అలాగే ఓటర్ల గుర్తింపు వివరాలను ధ్రువీకరిస్తూ, కొత్త ఓటరు నమోదు, పేర్ల సవరణ, చిరునామా మార్పులు, ఇతర వివరాల నవీకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మురారి స్మిత్ కోటేష్ గౌడ్ మాట్లాడుతూ, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సహ విద్యార్థిని కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం

- ఆపదలో అండగా నిలిచిన పాఠశాల మిత్రులు.. మానవత్వానికి నిదర్శనం



**దశ, ఇబ్రహీం పట్నం :** ఆపత్కాలంలో తమ సహ విద్యార్థిని కుటుంబానికి అండగా నిలిచి పాఠశాల స్నేహితులు మానవత్వాన్ని చాటారు. చింతుల్ల గ్రామ పంచాయతీ పరిధిలోని బాషమోనిగూడకు చెందిన అంతారం రాజిరెడ్డి అనారోగ్యంతో కొద్దిరోజుల క్రితం మృతి చెందగా, ఆయన కుటుంబానికి స్నేహితులు రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. రాజిరెడ్డి చికిత్స కోసం కుటుంబ సభ్యులు పెద్ద మొత్తంలో ఖర్చు చేసినప్పటికీ ఆయన ప్రాణాలు నిలవలేదు. ఈ విషయం తెలుసుకున్న ఆయన భార్య మమతతో కలిసి 2005-06 విద్యా సంవత్సరంలో చింతుల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్న సహ విద్యార్థులు ఆమెను పరామర్శించి, రూ.50 వేల నగదు అందించి ధైర్యం చెప్పారు. భవిష్యత్తులో కూడా మమత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు. ఆపదలో స్నేహితురాలి కుటుంబానికి అండగా నిలిచిన వారి సేవా భావాన్ని గ్రామస్థులు అభినందించారు.

## ఎబివిపి ఉస్మానియా యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం దిష్టి బొమ్మ దహనం




**దశ ఓయూ :**అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఉస్మానియా యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర దిష్టి బొమ్మ దహనం చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎబివిపి ఓయూ అధ్యక్షులు గెల్లు శేఖర్, కార్యదర్శి గుడూర్ మోక్షిత్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్ట్స్ కళాశాల వేదికగా ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధి కోసం రూ.1000 కోట్లు కేటాయిస్తామని ప్రకటించిన హామీని వెంటనే అమలు చేసి, ఆ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న 941 టీచింగ్ పోస్టులను మరియు నాన్ టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు.ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులకు రావాల్సిన 103 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాలా కాలంగా వెనుకబడిన అకాడమిక్ క్యాలెండర్‌ను తక్షణమే సరిచేసి, చెయ్యాలని విశ్వవిద్యాలయ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సిటీ సెక్రటరీ పృథ్వీతేజ, స్టేట్ జాయింట్ సెక్రెటరీ అలివేలు రాజు, విద్యానగర్ విభాకాన్వీనర్ హరిప్రసాద్, స్టేట్ యూనివర్సిటీ కో కన్వీనర్ గంధం నరేందర్, హరిచంద్ర, వీరబాబు, తన్మై, హరీష్, వివేక్, ధన్ రాజ్, మోహన్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ ప్రజల ఇసుకను బయటకు తరలించొద్దు





- స్థానికులకు అందుబాటు ధరలో ఇసుక అందించాలి..
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విమర్శలు.

**దశ, హుజురాబాద్:** హుజురాబాద్ నియోజకవర్గ ప్రజల అవసరాలకు వినియోగించాల్సిన ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ వేల కోట్లు ఆర్జిస్తున్న ప్రభుత్వం, అదే ఇసుకను స్థానికులు అధిక ధరలకు కొనుగోలు చేసే పరిస్థితి తీసుకొచ్చిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. స్థానిక ప్రజలపై ఇసుక భారం మోపవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవైపు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ప్రభుత్వం చెబుతుండగా, మరోవైపు ఇసుక కొరతతో లబ్ధిదారులు ఇళ్లు ఎలా నిర్మించుకోవాలని ప్రశ్నించారు. ఇసుక కొరత కారణంగా ప్రభుత్వ అభివృద్ధి పనులు, ప్రైవేట్ నిర్మాణాలు, కాంట్రాక్టర్ల పనులు కూడా తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని అన్నారు. వీణవంక, జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల్లో గతంలో రూ.1,500-2,000 ఉన్న ట్రాక్టర్ ఇసుక ధర ప్రస్తుతం రూ.8 వేల వరకు పెరిగిందని, హుజురాబాద్, కమలాపూర్ ప్రాంతాల్లో రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు విక్రయిస్తున్నారని తెలిపారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. హుజురాబాద్‌లో లభించే ఇసుకను ముందుగా స్థానిక అవసరాలకే కేటాయించాలని, స్థానిక అవసరాల కోసం ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపునకు అనుమతి ఇవ్వాలని కోరారు. అయితే నియోజకవర్గం దాటి అక్రమంగా ఇసుక రవాణా జరిగితే చట్టప్రకారం చర్యలు తీసుకోవడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇసుక విధానాన్ని వెంటనే పునఃసమీక్షించి, స్థానిక ప్రజలకు అందుబాటు ధరలో ఇసుక సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు.

# హరీష్ రావు నోరు అదుపులో పెట్టుకోవాలి.. లేకపోతే భౌతిక దాడులకు దిగుతాం

- ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి



**దశ, ఓయూ:** మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీష్ రావు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, ఆధారాలు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం, గురుకుల శాఖ మంత్రులపై చేస్తున్న ఆరోపణలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజా ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన తీవ్ర హెచ్చరిక చేశారు. గురుకులాల్లో రూ.2,000 కోట్ల అవినీతి జరిగిందంటూ హరీష్ రావు చేస్తున్న వ్యాఖ్యలను ఖండిస్తూ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఎదుట కొత్తపల్లి తిరుపతి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సోషల్ వెల్ఫేర్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, బీసీ వెల్ఫేర్ మంత్రి పొన్నం ప్రభాకర్, మైనారిటీ వెల్ఫేర్ మంత్రి అజారుద్దీన్‌లపై హరీష్ రావు చేస్తున్న నిరాధార ఆరోపణలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గురుకులాల్లో అవినీతి జరిగిందని చెబుతున్న హరీష్ రావును గన్‌పార్క్ వద్ద బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరినట్లు గుర్తు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేచి చూసినా హరీష్ రావు, కేటీఆర్ ఎవరూ రాలేదని ఎద్దేవా చేశారు. నిజంగా దమ్ముంటే ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీకి వచ్చి విద్యార్థుల సమక్షంలో బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు.

1200 మంది విద్యార్థుల త్యాగాలతో తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామన్నారు. అలాంటి ఉస్మానియా గడ్డపై బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి, మంత్రులు ఒక్కసారి కూడా అడుగుపెట్టలేదని విమర్శించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు సంవత్సరాల లోపే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండుసార్లు ఉస్మానియా యూనివర్సిటీని సందర్శించి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, ఎస్టీ సెల్ వైస్ చైర్మన్ భీమ్రావు మాట్లాడుతూ, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రంలో లక్షల కోట్ల రూపాయల అవినీతి, కుంభకోణాలు జరిగాయని ఆరోపించారు. ఆ పాలనలో సొంత పార్టీ నాయకులకు మాత్రమే లబ్ధి చేకూరిందని, సామాన్య ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని విమర్శించారు. హరీష్ రావు సొంత కుటుంబానికి చెందిన కల్వకుంట్ల కవితే గతంలో ఆయనపై అవినీతి ఆరోపణలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు ప్రజాపాలనపై నిరాధార ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు. ఇలాంటి ఆరోపణలను ప్రజలు సహించరని, ప్రజా వ్యతిరేక చర్యలకు తగిన సమాధానం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు దరువు రమేష్, యుగేందర్, రాజేందర్, కొమ్ము స్వామి, కొమ్ము సురేష్, బాబు, అరుణ్, రాజు, శ్రీనివాస్, రవి, చరణ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

03
దశ
నిజం.. నిర్భయంగా..
# ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
ఖమ్మం వైరా | సత్తుపల్లి | పాలేరు | మధిర
భద్రాద్రి కొత్తగూడెం కొత్తగూడెం | ఇల్లందు | పినపాక | భద్రాచలం | అశ్వరావుపేట
శుక్రవారం 03-07-2026
WWW.DASHANEWS.COM



# స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలి: ముత్యాల విశ్వనాథం


**దశ,మణుగూరు:** స్వామినాథన్ కమిటీ సిఫార్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని, రైతులకు రైతు ఆసరా (రైతు భరోసా) పథకం నిధులను విడతల వారీగా కాకుండా ఒకేసారి చెల్లించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు.

మణుగూరు మండలం రామాంజివరం గ్రామంలో గురువారం ఎడారి రమేష్ అధ్యక్షతన రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి స్వామినాథన్ కమిటీ సిఫార్సుల అమలే శాశ్వత పరిష్కారమన్నారు.

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కనీస మద్దతు ధరకు పంట కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం కారణంగా రైతులు దళారులకు తక్కువ ధరలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందడం లేదని, యూరియా సహా ఎరువుల ధరలు పెరగడంతో రైతులపై అదనపు భారం పడుతోందన్నారు. వెంటనే విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. ఒకప్పుడు "రైతే రాజు" అని చెప్పిన ప్రభుత్వాలు, నేడు రైతులను నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. రైతు బీమా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి, వ్యవసాయానికి అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మండల మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు, జిల్లా కార్యదర్శి, రైతు సంఘం నాయకులు, వ్యవసాయ కార్మికులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.




## హనుమాన్ జ్యువెలర్స్‌లో పోలీసుల భద్రతా తనిఖీలు



**దశ, పినపాక:** మండలంలోని ఏడుళ్ల బయ్యారం ఎక్స్‌రోడ్‌లోని హనుమాన్ జ్యువెలర్స్ ను ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సురేష్ భద్రతా పరంగా తనిఖీ చేశారు. షాప్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, రికార్డింగ్ సక్రమంగా జరుగుతున్నదీ కాదీ పరిశీలించారు.ఈ సందర్భంగా షాప్ యజమానికి భద్రతా చర్యలపై పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాలు ఎప్పటికప్పుడు పనిచేసేలా చూసుకోవాలని, నగదు, బంగారు ఆభరణాల భద్రతపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ తనిఖీలు ప్రజల ఆస్తుల భద్రతను మరింత బలోపేతం చేయడంలో భాగంగా నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

## సంత అభివృద్ధిపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక దృష్టి



**దశ, మణుగూరు(టౌన్):** మండలంలోని సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన గ్రామీణ సంత (అంగడి) అభివృద్ధికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక దృష్టి సారించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సంత ప్రాంగణంలో చేపట్టనున్న పూర్తి కాంక్రీట్ పనులకు సంబంధించి అంచనాల తయారీ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ మాట్లాడుతూ గ్రామీణ సంత అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేకంగా నిధులు కేటాయించి చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. సంతలో మౌలిక సదుపాయాలు మెరుగుపడితే రైతులు, వ్యాపారులు, ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గ్రామీణ సంతను అన్ని వసతులతో అభివృద్ధి చేయాలనే ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చిత్తశుద్ధిని మండల ప్రజలు అభినందిస్తున్నారని పేర్కొన్నారు. సమితి సింగారం గ్రామపంచాయతీ పాలకవర్గం తరఫున ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్. గణేష్ రెడ్డి, వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి జక్కుల అశోక్, సంబంధిత అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పశువుల అక్రమ రవాణా భగ్నం.. ముగ్గురి అరెస్ట్

**దశ, దుమ్ముగూడెం:** మండలంలోని ములకపాడు కూడలి వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు గురువారం పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, నంబర్‌ప్లేట్ లేని వాహనంలో చర్ల నుంచి పండితాపురం వైపు 12 పశువులను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే వాహనాన్ని స్వాధీనం చేసుకుని పశువులను రక్షించారు. ఈ ఘటనకు సంబంధించి పాల్వంచకు చెందిన షేక్ కాశీం, షేక్ హన్ను, వాహన డ్రైవర్ వంశీలపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్యాంప్రసాద్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న పశువులను సురక్షితంగా తరలించి, తదుపరి విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## అశ్వాపురం మండల కాంగ్రెస్ నూతన అధ్యక్షుడు ఓరుగంటి రమేష్‌కు ఘన సన్మానం



**దశ,అశ్వాపురం:** అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన ఓరుగంటి రమేష్‌ను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్త, సీనియర్ రిపోర్టర్ బర్ల కిరణ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త బేతం బాబు, గొల్లపల్లి నరేష్ కుమార్, కోలా శశికాంత్ తదితరులు రమేష్‌కు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం బర్ల కిరణ్ మాట్లాడుతూ పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తూ, స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు ముఖ్య అనుచరుడిగా సేవలందిస్తున్న ఓరుగంటి రమేష్‌కు పార్టీ సముచిత గుర్తింపు ఇచ్చి మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం అభినందనీయమన్నారు. ఈ నియామకానికి సహకరించిన డీసీసీ, టీపీసీసీ నాయకత్వంతో పాటు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు. ఓరుగంటి రమేష్ నాయకత్వంలో అశ్వాపురం మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని, పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## మొరంపల్లి బంజరలో ఇంటింటి ఎస్ఐఆర్ ఫారాల పంపిణీ

**దశ,బూర్గంపాడు:** ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రజలందరూ చురుకుగా పాల్గొని సహకరించాలని మొరంపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు వీరారెడ్డి కోరారు. బూర్గంపాడు మండలంలోని మొరంపల్లి బంజర గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమగ్రంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బీఎల్ఓలకు పూర్తి సహకారం అందించాలని సూచించారు. బీఎల్ఓలు ప్రతి ఓటరు ఇంటిని మూడుసార్లు సందర్శించి వివరాలను సేకరిస్తారని, బీఎల్ఏలు, ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు అవసరమైన వివరాలను నమోదు చేస్తారని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేయించుకుని ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అందుబాటులో ఉండి పూర్తి సహకారం అందిస్తానని వీరారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు, బీఎల్ఏలు, ఎన్యుమరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## జానంపేట తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించిన ఆర్‌జేడీ, డీఈఓ



**దశ, పినపాక:** మండలంలోని జానంపేట తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రాంతీయ సంయుక్త విద్యా సంచాలకులు (ఆర్‌జేడీ), జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి మండల విద్యాశాఖ అధికారి కొమరం నాగయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. పాఠశాల సందర్శనలో భాగంగా అధికారులు విద్యా కార్యక్రమాల అమలు, బోధన-అభ్యాసన విధానం, విద్యార్థుల అభ్యాస నైపుణ్యాలు, మౌలిక వసతులు, పాఠశాల నిర్వహణ, పరిశుభ్రత, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యా ప్రగతిపై ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై బోధనలో నాణ్యత పెంపు, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదల, వినూత్న బోధనా విధానాల అమలుపై పలు సూచనలు, మార్గదర్శకాలు అందించారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కొమరం నాగయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, జానంపేట గ్రామపంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, సీఆర్‌పీలు, గ్రామ పెద్దలు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం

**దశ , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో :** గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి, ఐటీడీఏ పరిధిలోని గ్రామాల్లో మౌలిక వసతులను విస్తరించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర మంత్రి సీతక్క (దనసరి అనసూయ),ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీటి సౌకర్యం, విద్య, వైద్యం, సాగునీరు, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడంతో పాటు అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి



ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకం, ఇందిరా మహిళా శక్తి, మహిళా సాధికారత, స్వయం ఉపాధి, రైతు సంక్షేమం, సామాజిక భద్రత తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు గిరిజనులకు మరింత సమర్థవంతంగా అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, అదనపు నిధుల కేటాయింపు, మౌలిక వసతుల విస్తరణ, విద్యా సంస్థల బలోపేతం, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వంటి అంశాలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష

**దశ, భద్రాచలం:** భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురికి భద్రాచలం న్యాయస్థానం రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది.

పోలీసుల వివరాల ప్రకారం, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ముగ్గురు నిందితులను భద్రాచలం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం. రాందాస్ ఎదుట హాజరుపరచగా, న్యాయస్థానం ప్రతి ఒక్కరికీ రెండు రోజుల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాచలం ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. ప్రజలు తమతో పాటు ఇతరుల ప్రాణాల భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.